# జన్మోత్సవం

(కథానిక)

"అబ్బ! చంపుతున్నావు కదూ! ఒక్క నిమిషం శాంతిగా ఉండనియ్యవు నన్ను."

—అన్నాడతను, నుదురు చిన్నదిచేసి, కళ్లు పెద్దవిచేసి. వెంటనే ఆమె చిన్నబుచ్చుకుంది. వంటింట్లోకి పోయి, పీటలువేసి, కంచాలుంచింది. రావచ్చు అని కేకవేసింది.

అతనువచ్చి కాళ్లు కడుక్కున్నాడు. తడి తుడుచుకుని, కూర్చునేలోపల మళ్ళా అందుకుంది ఆమె—"అడిగితే చిరాకు లేకపోతే మరపు. పోనీకదా, ఒక్కసారి జ్ఞాపకం చేసేసరికి ఎక్కడాలేని కోపం, అసహ్యం వస్తుంది. తిట్టడమేకాక, పైగా కొట్టడం కూడా. మును పెప్పుడూలేని కర్తా కర్మ క్రియలు ఇప్పుడు మరీ నేర్చుకుంటున్నారు." హస్తాభినయంతో మొహంలో స్వచ్ఛంగా భావప్రకటన చేసింది.

"దీనితో మనకేమిటి? గోలెప్పుడూ ఉన్నదే. మన కార్యనిర్వహణ మనం చేసుకుందాం!" అన్నట్లు కూరా అన్నం తినడం ముగించి—"మజ్జిగ వెయ్యి" అన్నాడు.

"వేస్తాకానీ నేను చెప్పినదానికి మాట్లాడరేం? మొన్న బాలసారెకి కూడా ఇలాగే అడ్డు పెట్టారు. అప్పుడు మా అమ్మ ఉండబట్టి ఆ మాత్రమేనా చెయ్యగలిగారు" అసావేరితో స,రి,గ,ల వరకూవచ్చి "మ" దగ్గర ఆగిపోయింది పడుచు.

అతను భోజనం ముగిస్తూ—"అన్నం బిరుసుగా వుంది. కూరలో కారం జాస్తీ. మజ్జిగ ఒట్టి సముద్రపు నీళ్ళే!" అంటూ ఆమెను ఇష్టం వచ్చినట్లు విమర్శించినప్పటికీ, సాధ్యమైనంత వరకూ అనుభవిస్తూన్న సారస్యాన్ని లోలోపల మెచ్చుకుంటూ మౌనం వహించాడు.

ఆమె అసావేరిలోంచి తేరుకుని అన్నది—"ఇటు నలుగురూ అటు నలుగురూ ఉన్నారు కనుకనా? ఒక్కగాను ఒక్కపిల్ల. దాని ముద్దు ముచ్చట మనంగాక మరెవరు తీరుస్తారు?" పదేళ్లపాటు బ్రతికి బట్టకడితే మా అన్నయ్య కొడుక్కిద్దామని నా కభిలాషగా వుంది."

అతను లేచాడు. చెయ్యి కడుక్కున్నాడు. ఆమె అతని వెనకనే కదలివెళ్ళింది...ఏం జవాబు వస్తుందో అని ఎంతో ఆపేక్షతో.

"ఎలాగైనా పాతిక రూపాయిలకి తక్కువ ఖర్చవదు దీని పుట్టిన రోజుకి. అంత డబ్బు ఈ కరువుకాలంలో ఎట్లా ఖర్చు పెడతాం?" అన్నాడు చెయ్యి తుడుచుకుంటూ.

"ఏం చిత్రమండీ! పుట్టింది ఈ ఒక్కర్తె. ఇరుగు పొరుగువాళ్ళంతా దొరసానిలా వుందని ఎంతో చక్కగా వుందని ముద్దులాడుతారు గానీ మీరొక్కసారైనా తియ్యరు. మీరే మనుసంటే అనుకోండి కానీ నిజంగా దీనిమీద ఒక్క పిసరైనా మీకు ప్రేమ లేదనుకోండి! మా అమ్మవుంటే ఎంతో ముచ్చటగా మిమ్మల్ని ఒప్పించి..." ఈసారి ముఖారి అందుకుని అందులో నిషాదంవరకూ వెళ్లింది.

"సరేకానీ! ఏంచేస్తాం? పోనీ అలాగే పుట్టినరోజు పండుగ చేసుకుందాంలే!" అని అనలేదతను..."వెధవ పేలాపన తగ్గించి నోరు మూసుకుని పడుండు. మాట్లాడితే ఏడుపొకటి నేర్చేవ్. ఎలాగైతేనేం కన్నావ్ కుర్రకుంకని. దానిమీద నీకొక్కర్తికే ప్రేమ ఒలికి పోతుందంటావు" అని చీదరించుకున్నాడు.

ఆమె అనుకున్న ప్రత్యుత్తరం కాదది. కళ్లు చెమ్మగిల్లాయి. వొళ్లు వణికింది. కళ్ళప్పగించి చూస్తూ ఊరుకుంది. అతను తువ్వాలు భుజం మీద వేసుకుని సిగరెట్టు ముట్టించి, అగ్గిపెట్టె పట్టుకున్నాడు.

ఆమె చికాకు పడ్డది. భర్త చేష్టకి అసహ్యించుకుంది. క్రోధంకూడా రగుల్కొందేమో రోజూ లాగ ఆమె తమలపాకులు అందివ్వనూ

బులుసు-జీ-ప్రకాశ్

లేదు. తను అడగనూ లేదు. నిద్రనుంచి పిల్ల లేచి యుద్ధఢంకా బజాయించింది.

"ఆఫీసులో ఆఫీసరుగోల. ఇంటివద్ద ఇల్లాలి గోల. మధ్యలో ఈ చంటిదాని ఏడుపొకటి!" అని అతను విసుక్కున్నాడు.

"ఎంత చిరాకండీ! ఇంట్లో చంటిపిల్ల ఆ మాత్రం ఏడవకుండా వుంటుందా?" అని పిల్లను తీసి ఆడించడం మొదలెట్టింది...శిశుమాత.

అతను మెట్లు దిగాడు. ఆమె వారించింది. అతను వినలేదు. బయటకి పోతే కొంచెమైనా మనశ్శాంతి కలుగుతుందేమోననుకున్నాడు. ఇంటి నుండి నిర్గమిస్తూ - "పిల్ల జన్మోత్సవంట" అని గొణుక్కున్నాడు.

* * *

కొంతసేపటికి ప్రక్కింటి పుల్లమ్మత్త వచ్చింది. ఆమె అడిగింది - "నాయనా! రేపే కదూ పిల్ల పుట్టిన రోజు!" అని గుమ్మంలోంచి లోనికొస్తున్న రామానందాన్ని ప్రశ్నించింది. ఈమెకెందుకు చెప్మా నా గృహ విషయాలు? అని ఏవగించుకున్నాడు రామానందం. అయినా జవాబివ్వక తప్పిందికాదు.

"అవును కాబోలు!" అని గొణుగుతూ చిరాకుతో మొహం ఒక ప్రక్కనుంచి రెండో ప్రక్కకి త్రిప్పాడు.

"ఇంకా సరుకులూ అవి కొనడం లేదూ? స్నేహితుల్నీ వాళ్ళనీ పిలవడం లేదూ? ఇలాగైతే పండుగ ఆగిపోదూ?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నల వర్షం కురిపించింది, పుల్లమ్మత్త.

"ఈ సారి పండుగ చేయడానికి కొంచెం ఇబ్బందిగా వుంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఇవేమీ చెయ్యడానికి మనస్కరించడం లేదు." అన్నాడు తప్పుకోడానికి చూస్తున్న వాడిలా.

"అలాగని మానేయడం ధర్మం కాదు నాయనా! నీకు డబ్బు కావలిస్తే మా అబ్బాయి వున్నాడు. నీకెంత కావలిస్తే అంత ఇప్పిస్తాను. అంతేగాని పండుగ చేయడం మానుకుంటామా? ఒక్కగాను ఒక్క పిల్లాను. లేక లేక ముచ్చటగా పుట్టింది. ఆ మాత్రం వేడుకగా జరిపించుకోపోతే మనస్సుకేం సంతోషంగా వుంటుంది చెప్పూ! నువ్వెందుకు ఒప్పుకోడం లేదని, నిన్న రాత్రినుంచీ నీభార్య కంటికీమంటికీ ఏకధారగా ఏడుస్తోంది. మా అబ్బాయి వాళ్ళూ, ఆశ్చర్య పోతున్నారు ఈ సంగతి విని."

అతనటునుండి యిటు తిరిగాడు. ఆమె వైపు చూశాడు. మౌనముద్ర వహించాడు.

ఆమె ఆఖరుగా అంది—"లే మరి! లేవోయ్! వేగం వెళ్లి కావలసిన సరుకులు తెచ్చేసేయ్. స్నేహితుల్ని పిలువు. మళ్ళా ఆలస్యమయిపోతే రేపు ఉదయానికి తెమలడం అతి కష్టం. సంతోషంగా ఉండు. నేను మళ్ళీ రాత్రి వస్తానోయ్! అప్పటికన్నీ సిద్ధమయితే రేపటి ప్రయత్నాలు మేము చేసుకుంటాం!" అంటూ ఆమె లోనికెళ్ళి ఆ మర్నాటి కార్యక్రమం అంతా వివరంగా అతని సతీమణికి తెలియజేసి వెళ్ళిపోయింది.

భార్య వచ్చింది. అతని మౌనానికి భంగం కలిగింది. ఆమె పెట్టెతీసి, చాకింటి చొక్కా ధోవతి అందించింది. తీసుకుని కట్టుకున్నాడు. పెట్టె తెరచి డబ్బుతీశాడు. కావలసిన సరుకులేవో ఆమె చెప్పింది. విని గుమ్మందిగాడు. ఆమె ఆనందం అంచులుదాటింది.

సరుకులు తెచ్చి పోగుపోశాడు. భార్యను కేకవేశాడు. ఆమెకి కళ్లు జిగేల్ మన్నవి. "ఇవన్నీ రాధకేనా?" అంది సంతోషంతో.

"ఊ!" అన్నాడతను నవ్వుతూ. ఉత్సాహంగా ఒక్కొక్కటే చూపించాడు - "ఈ రెండూ సిల్కుగౌన్లు. ఈ రెండు గాజులూ రేపుదయాన్నే తొడుగు. ఈ జరీచీర నీకు... రేపు దీన్నెత్తుకొన్నప్పుడు కట్టుకోడానికి. మరి కొద్ది దినాల్లో మనమ్మాయికి నడక వస్తుంది కదూ! అందుకే రబ్బరు జోళ్లునూ. చలివేయకుండా ఈ ఊలుటోపీ!..." చెప్పుకుపోతున్నాడు ఏమేమో!

ఆమె ఆనంద పారవశ్యంలో మాట్లాడలేక పోయింది. అతను కూతుర్ని తీసి ఎత్తుకుని, తనివితీరా ముద్దులు పెట్టుకున్నాడు. ఆటవస్తువులు ముందరపడేసి ఆడించాడు కూడా.

మర్నాడు తాము చెయ్యవలసిన పనులన్నీ చెప్పాడు. రాత్రెంతో ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. పుట్టిన రోజును తలుచుకుంటూ సుఖంగా నిద్రపోయారు.

ఉదయాన్నే గృహిణి లేచింది. ఆవలిస్తూ

పక్కకు తిరిగి భర్త పడక చూసింది. భర్త లేడు -"ఎంతవేగంగా లేచి అప్పుడే బైటకు పోయారు!" అనుకుంది.

ఇన్నాళ్ళ జీవితంలోనూ, ఇంత పెందల కడనే లేవడం అతనికిదే మొదటిసారి. తల్లి పిల్లకి తలంటి నీళ్లు పోసింది. బంగారపు గాజులు తొడిగింది. కొత్తగౌను తొడిగింది.

తొమ్మిదిన్నరైంది. మిత్రగణమంతా వచ్చేశారు. ముగ్గులు! తోరణాలు! కన్నుల వైభవంగా వుంది. కానీ అతనింకా రాలేదేం చెప్మా?... ఏదో అర్జంటు పనిమీద వెళ్లుంటారు. ఇంకో గంటకో గడియకో వచ్చేస్తారు, అనుకుంటున్నది.

మధ్యాహ్నం పన్నెండు, ఒంటిగంట!... రెండు కావస్తోంది. అతనింకా రాలేదు. బహుశా ఆఫీసు పనిలో మునిగి తేలుతున్నారేమో! వెధవ ఆఫీసు వర్కుకి అంతూ పంతూ కూడా లేనట్లుంది. ఏమిటో యీ తంతు! బిడ్డ జన్మోత్సవానిక్కూడా చావ తీరిక లేకపోతే అదేం పని?

స్నేహితులందరూ వెళ్ళిపోయారు. పార్వతినీ వంటమనిషినీ తానే పంపేసింది. ఇంట్లో ఆమె, పిల్లా అంతే! మరెవ్వరూ లేరు. మామిడి తోరణాలు వెక్కిరించినట్లుయింది. పట్టపగలు అర్ధనిశీధినిలా కనిపించిందామెకు-

"అమ్మగారూ?" అని కేక! ఆఫీస్ ప్యూన్ వచ్చి ఏదో ఉత్తరం యిచ్చాడు. "అయ్యగారిమ్మన్నారు" అని వెళ్ళిపోయాడు. ఒళ్ళు వణికింది. గుండె దడదడమన్నది. "మరేం ప్రమాదం జరగలేదుకదా?" అని ఉత్తరం విప్పి చదవడం మొదలెట్టింది. "శ్యామలకి—

ఇది నీకందేసరికి ఆరేడు జిల్లాలు ఎల్లాగో దాటిపోతున్నాను. నా కోసం ప్రయత్నించి లాభం లేదు. నేను నీకు మరి దొరకను. అమ్మాయి జన్మోత్సవంనాడు నేను చేసిన ఈ చర్య నీకు అతి వింతగా కన్పిస్తుంది కదూ! ఇందులో వింత యేమీ లేదు... అసలు మొదట్నుండీ ఆపండుగ చెయ్యాలనే నాకభిప్రాయం లేదు. మొదట్లో ఆ అభిప్రాయమే నీకు వ్యక్తీకరిస్తూ వచ్చా.

"నా మాటల్లోని ధ్వనుల్ని, ధ్వనులచాటున నిల్చివున్న నా మనోగతాభిప్రాయాన్ని నువ్వు జాగ్రత్తగా పరిశీలిస్తే నువ్వు నన్నందుకు ఒత్తిడి పెట్టేదానివి కావు, ఇరుగుపొరుగు అమ్మలక్కలందరూ నన్ను పీడించి బలవంత పెట్టేవాళ్లు కారు. కానైతే బలవంతానికి లొంగి మీకు ఆనందదాయకమైన ఒక సంఘటనను చేతులార నాశనం చేసి, మీ మనస్సులో శోకాన్ని రేకెత్తించే ఉద్దేశంలేక, కడకు జన్మోత్సవం చెయ్యడాని కంగీకరించి, నువ్వు చెప్పిన పనులన్నీ కీలుబొమ్మలా చేశాను. నువ్వేమో, నా ఆ మార్పుకు విశేషంగా పొంగిపోయి నన్ను వేయివిధాల మెచ్చుకుని వుంటావు. ఇట్లా మెచ్చుకున్నావంటే నీకన్నా తెలివితక్కువది లేదు అవన్నీ, పులిగుండెతో, అవుముఖంతో చేస్తున్న పనులేతప్ప నీ పిల్లమీద అభిమానంతో చేసిన పన్లేమీ కావు.

కారణం? అది నీపిల్ల! నీ పిల్లంటే నాపిల్ల కావాలనెక్కడుంది? ఇరుగుపొరుగు అమాయక అమ్మలక్కలందరూ 'అచ్చంగా తండ్రి పోలికే' అంటే భ్రమిసేవాణ్ణి. కాని రాను రాను నిజం బయట పడకపోతుందా? నేనే గ్రహించగలిగాను. ఈ విషయంలో నువ్వే కాదు, ఆదినుంచీ లోకమంతా నన్ను మోసగిస్తూ వచ్చింది. ఈ క్రిందే నీ చర్యల్ని నేను రుజువు చేస్తున్నాను. నిజమో, కాదో చెప్పు. నా సర్టిఫికేట్ పట్టుకుని ఎక్కడికో వెళ్ళావ్. వెళ్ళావా? లేదా? అప్పట్నుంచీ నీవు తిరిగి వచ్చేటప్పుడు నీవు వెళ్ళినప్పట్లా లేవు, నీ మానసిక పరిస్థితి మారిపోయింది. ఎందుకు మారిపోయింది? నాకీ ఉద్యోగం నా అవసరంలేకుండా వచ్చింది. ఎట్లా వచ్చింది? నేను నిరుద్యోగంలో ఉన్నానని ఆఫీసరు కలగన్నాడా? లేక నువ్వు స్వయంగా చెప్పి నాకీ ఉద్యోగం వేయించావా? నన్ను పిల్చుకుని ఆఫీసరు యింటికి తోడుకుని వెళ్ళినపుడు అతడు నిన్ను చూసే నవ్వాడు. ఎందుకు నవ్వాడు? నా ఉద్యోగం వచ్చినప్పట్నుంచీ నా సంపర్కం ఎందుకు నీవు మానేయవలసి వచ్చింది? ఇన్నిటికీ పైగా పిల్ల నుదుటిపై ఆఫీసర్ నుదుటి మచ్చ రావడాని క్కారణం ఏమంటావ్? ఎందుకు ఆఫీసరు నిన్ను చూడడానికి యింటికి వచ్చేవాడు? ఇంకా ఆ పిల్ల నాపిల్లే నంటావా? నేనెందుకు జన్మోత్సవం చేయాలి?"